క్లుప్తంగా

శాంతిభద్రతలకు పెద్ద పీట వేయాలి



పెదవేగి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

పెదవేగి : గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్ద పీట వేయాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సిబ్బందికి సూచించారు. సోమవారం సాధారణ తనిఖీల్లో భాగంగా పెదవేగి పోలీస్‌స్టేషన్ ఎస్పీ సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల మెయిన్‌టెనెన్స్ తదితర విషయాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఫ్రెండ్లీ పోలీస్‌గా మెలగాలని సూచించారు.

గోమాతకు కవల దూడలు జననం



కవల పిల్లలకు జన్మనిచ్చిన గోమాత

పెదపాడు: అప్పనవీడులోని ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాలలో గాయిత్రి పేరుగల గోమాత కవల దూడలకు జన్మనిచ్చింది. పాఠశాలలో ఉన్న గోశాలలో 20 ఆవులకు గాను గోశాల యజమాన్యంచే గాయిత్రి పేరుతో పిలవబడే ఈ గోవు 1ఆడ, 1మగ దూడలకు జన్మనివ్వడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. 10వేల గోవుల్లో ఒకటి రెండు గోవులకు ఇలా కవలలు జన్మించే సూచనలు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

దెందులూరు: అధ్యాత్మిక, విద్యారంగాల అభివృద్ధికి యండగండి మేడరాజు సేవలు అభినందనీయమని పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాథర్ పీ. డేవిడ్ అన్నారు. సోమవారం పోతునూరు ఆర్‌సీఎం చర్చికి రూ. 60 వేలు విలువ గల వాటర్ ఫిల్టర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా దాత యండగండి మేడ రాజు మాట్లాడుతూ పాఠశాలల్లో ఫర్నీచర్, పుస్తకాలు, చర్చిల్లో భక్తుల సౌకర్యార్థం వాటర్ ఫిల్టర్‌ను ప్రాంతాలకు అతీతంగా కొన్ని సంవత్సరాలుగా తన వంతు సాయంగా అందిస్తున్నామన్నారు. అనంతరం ఫాథర్ డేవిడ్, దాత రాజును ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి పనుల ప్రారంభం

దెందులూరు: జాతీయ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం అన్నారు. సోమవారం జోగన్నపాలెంలో ఉపాధి పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల నిర్వహణలో కూలీలకు సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నిట్టా గాంధీ, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, నాయకులు నిట్టా గంగరాజు ఉన్నారు.

రైతుల ధర్నా

భీమడోలు : ధాన్యం కొనుగోలు చేయాలని, గోనె సంచులు సరఫరా చేయాలని కోరుతూ గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో సోమవారం రైతులు రోడ్లపై ధర్నా చేశారు. గుండుగొలను సొసైటీ వద్ద గ్రామానికి చెందిన రైతులు గుండుగొలను, పోతునూరు వెళ్లే రహదారిపై బైఠాయించారు. సొసైటీకి కేటాయించిన 10 లారీలు సైతం రావడం లేదని, కళ్లాల్లో ధాన్యాన్ని పట్టి ఉంచామని, మరి కొందరి ధాన్యం కళ్లాల్లోను, రోడ్లపై ఆరబోసామని, వాతావరణం పరిస్థితులు ఆందోళన కల్గించేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

లారీ డ్రైవర్‌కు గాయాలు

ఉంగుటూరు: ఉంగుటూరు వద్ద జాతీయరహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ధాన్యం లోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లోడు లారీ ముందు భాగంగా నుజ్జు కాగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెదవేగి : కుటుంబంలో తలెత్తిన ప్రతికూల పరిస్థితుల కారణంగా ఓ వ్యక్తి ఇంటిని వదిలి వెళ్లిపోయాడని భార్య పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం గార్లమడుగు పంచాయతీకి చెందిన నర్ని జోగేశ్వరరావుకు 55 సంవత్సరాలు ఉంటాయని, ఇతను ఇంట్లో కుటుంబ తగాదాలు పురస్కరించుకుని ఈనెల 24 తెల్లవారుజామున ఇంట్లో నుంచి ఎవ్వరికి చెప్పకుండా బయటకు వెళ్లాడని, సాయంత్రం వరకు వెతికినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ల దగ్గర, సమీప ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో జోగేశ్వరరావు భార్య మనేంద్ర తన భర్త ఆచూకి కోసం ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కళాశాలకు పుస్తకాల అందజేత

ఉంగుటూరు: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు రూ.2 లక్షలు విలువ చేసే పుస్తకాలను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం సోమవారం అందజేసింది. నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది కూన కృష్ణారావు, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, ఐక్యు సమన్వయ కర్త రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



భీమడులులో ప్రజాప్రతినిధులు, అధికారులను సత్కరించిన ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ తదితరులు



ఉంగుటూరు సర్పంచ్ సింధు, కార్యదర్శి గిరిలను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్



గణపవరం మండల కార్యాలయంలో సభలో సన్మానిస్తున్న అధికారులు

దెందులూరు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా దెందులూరు మండలంలో ఉత్తమ పంచాయతీల పురస్కారాలు అందజేశారు. చల్లచింతలపూడి గ్రామ పంచాయతీకి 7 విభాగాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పరిరక్షణ, స్వయం సమృద్ధి, సామాజిక భద్రత, కట్టుబాట్లు, ఐకమత్యం, లింగసమానత్వం అమలులోఉత్తమ పంచాయతీగా జిల్లా అవార్డులు వచ్చాయి. సోమవారం గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ, గ్రామ కార్యదర్శి షర్మిలకు అవార్డు, ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ అందచేశారు. కొవ్వలి గ్రామ పంచాయితీ సర్పంచ్ ఇంటేటి మధులతా గంగాధర్, కార్యదర్శి రంగనాయకమ్మలకు ద్వితీయ స్థానం లభించింది. పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, కార్యదర్శి షఠరీఫ్‌లకు నాలుగు విభాగాల్లో, గోపన్నపాలెం గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, కార్యదర్శి యహోషువా, కొత్తగూడెం గ్రామ సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత, కార్యదర్శి ఆదిలక్ష్మి మూడు విభాగాల్లో, సోమవరప్పాడు గ్రామ సర్పంచ్ సరిగే నాగరాజు, కార్యదర్శి ముంగర శ్రీనివాస్, గంగన్నగూడెం గ్రామ సర్పంచ్ ఉప్పలపాటి లక్ష్మణరావు, కార్యదర్శి ఆనంద్ ఒక విభాగంలో, పెరుగ్గూడెం గ్రామ సర్పంచ్ యలమర్తి రేవతి, కార్యదర్శి శ్రీనివాస్, రామారావుగూడెంగ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి, కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి రెండు విభాగాల్లో, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలకు గానూ ఉత్తమ సర్పంచ్, కార్యదర్శులుగా ఎంపికయ్యారు. వీరికి సోమవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి అవార్డులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేశారు.

భీమడోలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలో పొందుపర్చిన 9 అంశాల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభను చూపిన పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామకార్యదర్శులను ఘనంగా సత్కరించారు. సూరప్పగూడెం, భీమడోలు గ్రామ పంచాయతీలు 6 అంశాల్లోను, చెట్టున్నపాడు 5, దుద్దేపూడి 3, కురెళ్లగూడెం, అంబర్‌పేట పంచాయతీలు రెండేసి చొప్పున, గుండుగొలను, పోలసానిపల్లి గ్రామాలు ఒకొక్కటి చొప్పున ప్రతిభను చూపాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీవో డి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా విస్తృతమైన అధికారులు సంక్రమించాయని, గ్రామాలు సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ పురస్కారాలకు ఎంపికైన సర్పంచ్‌లు పాము సునీతామాన్‌సింగ్, జల్లూరి వెంకట నరసమ్మ, ఏపూరి భానుదీపిక రాంబాబు, గుడివాడ నాగగౌతమి రామాంజనేయులు, నీలం శ్రీనివాసరావులతో పాటు గ్రామ కార్యదర్శులు ఎస్.ఠాగూర్, మురళీ, వైయూఎం సూర్య, కె.వెంకట్రావు, గౌతమి, ఎంపీటీసీలను దుశ్శాలువాలు కప్పి ప్రశంసా పత్రాలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు గంటా శ్రీనివాసరావు, బొల్లారపు జ్ఞానరమ్య పవన్, దాసరి విజయభాను, అంబటి దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

భీమడోలు : భీమడోలు గ్రామ పంచాయతీ ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారుల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాల్లో 6 అంశాలల్లో ఉత్తమ ప్రతిభను కనుబర్చి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించిన భీమడోలు పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్‌తో పాటు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, వార్డు సభ్యులు సవలం కుమారి, సప్పా దుర్గలను పంచాయతీ అధికారులు దుశ్శాలువాలను కప్పి సన్మానించారు. సభకు అధ్యక్షత వహించిన గ్రామకార్యదర్శి ఎస్.ఠాగూర్ పంచాయతీరాజ్ దినోత్సవం విశిష్టతను వివరించారు.

సచివాలయ వ్యవస్థతో మరింత బలోపేతం

ఉంగుటూరు : సచివాలయ వ్యవస్థతో పంచాయతీ రాజ్ వ్యవస్థకు మరింత బలం చేకూరిందని ఎంపీపీ గంట శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశం మందిరంలో నిర్వహించిన పంచాయతీరాజ్ దినోతవ్సంలో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ అధ్యక్షుడు పుప్పాల గోపి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఈవోపీఆర్‌డీ షంషుద్దీన్, వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఆంజనేయులు, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీల ఛాంబర్ అధ్యక్షుడు బండారు నాగరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుత్సకాయల విష్ణుమూర్తి మాట్లాడారు. తొలుత సర్పంచ్‌లను, ఎంపీటీసీలను శాలువాలు కప్పి సత్కరించారు.

ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

పెదపాడు: మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులు ప్రధానం చేశారు. 9 విభాగాల్లో వివిధ గ్రామ పంచాయతీలకు ఈ అవార్డులు అందించారు. ప్రోవర్టీ ఫ్రీ అండ్ ఎన్హాన్స్ లైవ్ హుడ్ పంచాయతీ అవార్డు,హెల్తీ పంచాయతీ అవార్డు కలపర్రుకు దక్కింది. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు కలపర్రు, తాళ్లగూడెం, అప్పనవీడు గ్రామ పంచాయతీలకు, వాటర్ సఫీసియన్ట్ పంచాయతీ అవార్డు నాయుడుగూడెం, కలపర్రు, తాళ్లగూడెంలకు లభించాయి. క్లీన్ గ్రీన్ పంచాయతీ అవార్డు నాయుడుగూడెం, వట్లూరు, రాజుపేట గ్రామాలకు, సెల్ఫ్ సఫిషియంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్ పంచాయతీ అవార్డు నాయుడుగూడెం, కొత్తూరు, సత్యవోలు గ్రామాలు పొందాయి. సోషల్ సెక్యూరిటీ పంచాయతీ అవార్డు నాయుడుగూడెం గ్రామ పంచాయతీకి, పంచాయతీ విత్ గుడ్ గవర్నన్స్ అవార్డు నాయుడుగూడెం, అప్పనవీడు, ఏపూరు గ్రామాలకు లభించాయి. ఈమేరకు పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్ సూర్యకుమార్, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజుల చేతుల మీదుగాఈ అవార్డులను అందజేశారు. ఈకార్యక్రమంలో నర్సాపురం నియోజకర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, కోటి రెడ్డి, ఇళ్లారి విజయ్‌కుమార్, ఘంటసాల మోషే తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా ఉంగుటూరు

ఉంగుటూరు : జిల్లాలో ఉత్తమ పంచాయతీగా ఉంగుటూరు పంచాయతీ ఎంపికై ంది. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బండారు సింధు, కార్యదర్శి గిరిధర్, ఉపసర్పంచ్ పాతూరి జగదీష్ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని శాలువాకప్పి సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

పెదవేగి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిసచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి వైపు పరుగులు తీసేలా కృషి చేస్తున్నారని ఎంపీపీ తాతా రమ్యకుమార్ అన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెప్రగతికి పంచాయతీరాజ్ వ్యవస్థ దోహదం

గణపవరం : పల్లెల ప్రగతికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతో దోహదం చేసిందని, నూతనంగా 73వ రాజ్యాంగ సవరణలో పంచాయతీ రాజ్ వ్యవస్థ మరింత బలోపేతమైందని పలువురు అన్నారు. సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గణపవరం మండల కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి మాట్లాడుతూ స్థానిక సంస్థలు తమ వనరులు పెంచుకుని ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులు పక్కదారి పట్టకుండా పల్లెల అభివృద్ధికి వినియోగించాలన్నారు. సభలో తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల చినబాబు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, ఎంఈవో పుచ్చల శేషు, గణపవరం సర్పంచ్ మూర అలంకారం, వివిధశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో పారిశుధ్య నిర్వహణలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సరిపల్లె, వరదరాజపురం, ఎ.గోపవరం సర్పంచ్‌లు చనుమూరి దుర్గాభవాని, కోడేటి నర్సింహమూర్తి, పొతంశెట్టి పద్మలకు అవార్డులు అందచేశారు.



ఉంగుటూరులో ప్రజాప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం



పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో అవార్డులు అందిస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు



అవార్డు అందుకున్న చల్ల చింతలపూడి సర్పంచ్ వెంకటేశ్వరమ్మ

వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం

దెందులూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి నాని అన్నారు.సోమవారం శ్రీరామవరంలో దెందులూరు జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, సచివాలయాల దెందులూరు మండల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి జరిగిన విలేకరుల సమావేశంలో కామిరెడ్డి నాని మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి కోటి కుటుంబాలకు ప్రజామద్దతునివ్వడం చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్లు, ఎంపీటీసీలు, పార్టీ అన్ని విభాగాల నేతలు, గృహసారథులు, నాయకులు, వలంటీర్లు దెందులూరులో మండలంలో 25,500 కుటుంబాలు ఉండగా 23,200 గృహాలను సందర్శించడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలన్ని దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లకు జమ చేయడం, వృద్ధులు, వివిధ విభాగాలకు చెందిన పెన్షన్ల లబ్ధిదారులందరూ పెన్షన్ కోసం ఒక పూట కార్యాలయం చుట్టూ తిరగకుండా వలంటీర్లు ఇంటికి వచ్చి నగదు ఇవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో సారి అధికారంలోకి వస్తేనే పేదలందరికీ సంక్షేమం, అభివృద్ధి, భరోసా భద్రత లభిస్తుందని ప్రజలందరూ భావిస్తున్నారన్నారు. ఏలూరు వైద్యశాలలో ఏసీ పనిచేయడం లేదు.. వైద్యశాలల మీటింగ్‌లు జరగడం లేదని అవాకులు.. చవాకులు పేలటం చింతమనేని మానుకోవాలన్నారు. మరోసారి మహిళలు చింతమనేనికి గట్టిగా వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దెందులూరు జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మాట్లాడుతూ ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలుగుతున్న ఆదరణను చూసి టీడీపీ నాయకులు తట్టుకోలేక సమస్యను పక్కదారి పట్టించడం, లేనిపోని శాంతిభద్రతల సమస్యలు తలెత్తాలా మాట్లాడటం సరికాదన్నారు.మండల నాయకులు నిట్టా గంగరాజు, మేధినరావుపాలెం గ్రామ అధ్యక్షుడు మేడికొండ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీలు అంగడాల వెంకటేశ్వరరావు, కాలి ఇస్రా యేలు, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుదీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలి రాంబాబు, గృహసారథులు, వలంటీర్లు ఉన్నారు.



శ్రీరామవరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శ కామిరెడ్డి నాని, జడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం

బీజేపీ పాలనకు చరమగీతం

గణపవరం: వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, వచ్చే ఎన్నికలలో బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సోమవారం గణపవరం మండలంలో వామపక్షాల పిలుపుమేరకు సీపీఐ, సీపీఎం పార్టీలు ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వ పాలనలో దేశంలో అశాంతి, అభద్రత భావం నెలకొందన్నారు. అధికారంలోకి వస్తే విదేశాలలో దాచిన నల్ల ధనం తెచ్చి పేదలకు పంచుతానన్న మోది తొమ్మిదేళ్ల పాలనలో ఏంచేశారని ప్రశ్నించారు. గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ ప్రచారం చేశారు. జిల్లా సీపీఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, మండల సీపీఐ కార్యదర్శి గంజిరాజు, సభ్యులు సనపల శ్రీనివాస్, కోన గొల్లయ్య, కె.రమేష్, పతివాడ గణపతి, పీతల రవి, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడలేక విమర్శలు

పెదపాడు: జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని వారు నోరు అదుపులో ఉంచుకుంటే మంచిదని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీకి చెంది ఓ వ్యక్తి ఇంజనీరింగ్ చదివే విద్యార్థినిపై అఘాయిత్యం చేసి ఆమెపై నూనెను పోసిన విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే చింతమనేని ప్రభాకర్ ఆరోగ్య శాఖామంత్రిపై ఆవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. నాడు నేడు పథకంలో ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహిళలంటే చిన్నచూపు ఉండబట్టే మంత్రిని కించపర్చే విధంగా అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నాడని దయ్యబట్టారు. చింతమనేనికి బుద్ధి మందగించడంతోనే బీసీ మహిళలపై స్త్రీలపై గౌరవం లేకుండా, సభ్య సమాజం తల దించుకునేలా ఉన్న ఆయన తీరును తప్పుపట్టారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా భావించి అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. తక్షణమే మంత్రి విడుదల రజనికి బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ,, ఎంపీపీ బత్తుల రత్న కుమారి పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

భీమడోలు : స్థానిక బైపాస్ రోడ్డులో శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచులు ఛాంబర్ అధ్యక్షురాలు పాము సునీతామాన్‌సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, భక్తుల దాహార్తిని తీర్చేందుకుగా సత్యసాయి సేవా సమితి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. భీమడోలు సేవా సమితి అధ్యక్షుడు వర్ధినీడి సత్యసాయి మాట్లాడుతూ దాతల సహకారంతో ఏటా సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఐదుగురు నారాయణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, మానవత సేవా సమితి చైర్మన్ గుల్ల నూకరాజు, పెద్దలు పంచకర్ల సత్యనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రంలో మజ్జిగను అందిస్తున్న జెడ్పీటీసీ భవానీ రంగ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్

దొంగ మస్తర్లు వేయనందుకు మహిళా మేట్లపై దౌర్జన్యం

దెందులూరు: దొంగమస్తర్లు వేయడానికి నిరాకరించినందుకు కొత్తగూడెం గ్రామంలో తమపై దౌర్జన్యం చేశారని విధులకు ఆటంకం కల్పించారని గ్రామానికి చెందిన ఉపాధి పని మేట్లు ఆరోపించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో గ్రామానికి చెందిన ఉపాధి మేట్లు ఆడపాల నాగమణి, ఇస్నిగిరి సరస్వతి, షేక్ మెహెర్నిషబేగంలు మాట్లాడుతూ ఉపాధి పనికి దొంగ మస్తర్లు వేయాలని కడగల మౌనిక, వంజరపు సావిత్రి, కడగల లక్ష్మి, పంటల వెంకటలక్ష్మి, గౌర్రెల వెంకటరమణారావు, గౌర్రెల వెంకటలక్ష్మి తమపై దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగించారన్నారు. ఈ విషయంపై దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. ఏలూరు పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి పులవర్తి సంతోష్, శింగవరం వైఎస్సార్‌సీపీ నేత రాజు, మాట్లాడుతూ మేట్లపై జరిగిన దాడిని ఖండించారు. దొంగమస్తర్లు వేయకపోతే దౌర్జన్యం చేసి విధులకు ఆటంకం కలిగిస్తారా అని ఆగ్రహించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌లను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం కృషి



రామారావుగూడెంలో జగనన్నే మా భవిష్యత్తు సర్వే నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అందరూ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామిరెడ్డి నాని మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో గడపగడపకూ సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ టీడీపీ, అనుకూల వర్గాలతో సహా సంతృప్తి వ్యక్తం చేయడం వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విషయాన్ని స్పష్టంగా తాము గమనించామన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ప్రజలు చెప్పిన ప్రతి సమస్యను త్వరలోనే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషితో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పేరం ప్రసాద్, పర్వతనేని నరేంద్ర, శివప్రసాద్, బాబ్జి, రామకృష్ణ, సుబ్బారావు, గృహసారథులు, వలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

రాయన్నపాలెంలో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు

పెదవేగి : మండల వ్యాప్తంగా ఉత్సాహంగా జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి పెదవేగి మండలం రాయన్నపాలెంలో సందడిగా సాగింది. గ్రామ పంచాయతీ పరిధిలోని మహాత్మాగాంధీ కాలనీ లో ప్రతి గడపకి వెళ్లి జగనన్న ప్రభుత్వం చేకూర్చే లబ్ధి, అందించే పథకాలు ప్రజలకు నాయకులు వివరించారు. జగనన్న ప్రభుత్వ పరిపాలన, పనితీరు పట్ల ప్రజల యొక్క అభిప్రాయాల సేకరణ తీసుకోని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ , వార్డు మెంబర్స్ , గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామసచివాలయ కన్వీనర్స్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.